క్లుప్తంగా

మృతుని కుటుంబానికి మాజీ డిప్యూటీ సీఎం పరామర్శ



తిరుపతిరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

పాచిపెంట: మండలంలో విశ్వనాథపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తిర్లంగి తిరుపతిరావు మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర విశ్వనాథపురం గ్రామానికి వెళ్లి తిరుపతిరావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధైర్యపడవద్దని పార్టీ పరంగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు ఉన్నారు.

అడ్డగోలు నియామకాలు రద్దు చేయాలి

- గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు పాలక రంజిత్ కుమార్



పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా వైద్యారోగ్యశాఖలో జరిగిన అడ్డగోలు నియామకాలు రద్దు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఐటీడీపీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ వైద్యారోగ్యశాఖలో తాత్కాలిక పద్ధతిలో మెడికల్ ఆఫీసర్, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్, సీనియర్ డీఆర్–టీబీ,–హెచ్ఐవీ సూపర్‌వైజర్, అకౌంటెంట్ ఐదు పోస్టులు భర్తీ చేశారని, ఈ నియామకాల్లో ఎటువంటి రిజర్వేషన్ పాటించ లేదన్నారు. ఇది ఎస్సీ, ఎస్టీలకు జరిగిన అన్యాయమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నియామకాలపై విచారణ జరిపించాలని, కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చి, రిజర్వేషన్ ఇచ్చి పారదర్శకంగా పోస్టులు భర్తీ చేయాలని కోరారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి




పశువైద్యశిబిరాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి భోగి చక్రధర్

పార్వతీపురం టౌన్: పశువైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ బి.చక్రధర్ అన్నారు. ఈ మేరకు పార్వతీపురం మండలం పుత్తూరు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 31 తేదీ వరకు మండల వ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరాల్లో గర్భకోశవ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలైన నట్టల నివారణ, పశువ్యాధినిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి నిఘంటువు లెనిన్

- సీపీఎం రాష్ట్ర సీనియర్ నాయకుడు ఎం.కృష్ణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు కృష్ణమూర్తి

పార్వతీపురం టౌన్: దేశంలో ప్రజాస్వామ్యం అంగట్లో సరుకుల్లా మారుతోందని సీపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు ఎం.కృష్ణమూర్తి అన్నారు. కామ్రేడ్ వీవీ లెనిన్ శత జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా సదస్సుకు కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెనిన్ 54 ఏళ్ల జీవితకాలంలో చేసిన కృషి ప్రపంచ పీడితుల విముక్తి మార్గానికి నిత్య సూర్యోదయంగా కష్టజీవుల ఉద్యమాలకు ఉఛ్వా నిశ్వాసంగా వెలుగొందుతున్నారన్నారు. కార్యక్రమంలో మండంగి రమణ, రెడ్డి శ్రీదేవి, మర్రి శ్రీను, కోరాడ ఈశ్వరరావు కొల్లి సాంబమూర్తి , రెడ్డి ఈశ్వరరావు, సీతారాం, పాకల సన్యాసిరావు, ఎస్.ఉమ, మంకురు సూరిబాబు, ఎం.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

సాలూరు: డయల్ యువర్ డీఎం కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు సాలూరు ఆర్టీసీ డిప్యూటీ సూపరింటెండెంట్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు, ప్రయాణికులు ఫోన్ 9959225622 నంబర్‌కు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు కాల్ చేయాలని కోరారు.

- యథేచ్ఛగా పాలిథిన్ కవర్ల వినియోగం
- పర్యావరణానికి పొంచి ఉన్న ముప్పు
- అధికారుల చర్యలు శూన్యం

ప్లాస్టిక్ నిషేధం.. ప్రకటనలకే పరిమితం



రోడ్డు పక్కనే పడేసిన కవర్లు, వ్యర్థాలు

బలిజిపేట: జీవకోటి మనుగడకు ముప్పు తెచ్చే ప్లాస్టిక్ నిషేధం అంతా కాగితాలకు, అధికారుల ప్రకటనలకు, నిషేధిత ప్రచారాల బోర్డులు, అధికారుల ఫొటో ఫోజులకే పరిమితమైంది. ఆచరణలో ఇసుమంతయినా కనిపించడం లేదు. రోజురోజుకూ వినియోగం పెరుగుతోంది తప్ప తగ్గడం లేదు. అధికారులు నిద్రావస్థలో ఉన్నారు తప్ప ప్లాస్టిక్ నిషేధంపై చర్యలు చేపట్టడం లేదు. పాలిథిన్ కవర్లు మార్కెట్‌లో విచ్చలవిడిగా విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వాటి వినియోగం పర్యావరణ పరిరక్షణకు పెనుభూతంగా మారిందని తెలిసినా వాటి వినియోగం ఎక్కువవుతోంది. ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకూ మనం చేసే ప్రతి పనిలోనూ పాలిథిన్ వినియోగం ఉంటోంది. టీ, కాఫీల కొట్ల నుంచి తేవాలన్నా, కూరగాయలు, కిరాణా సామగ్రి, పండ్ల దుకాణాలు, కర్రీ పాయింట్ల వద్ద కర్రీలు తేవాలన్నా, ఎక్కడ ఏ వస్తువు కొనుగోలు చేసినా అక్కడ పాలిథిన్ కవర్ల వినియోగమే కనిపిస్తుంది. వినియోగించిన కవర్లు ఇష్టానుసారం పారవేయడంతో అవి భూమిలో కలిసి పర్యావరణానికి ముప్పు తెస్తున్నాయి. ప్రభుత్వం వాటిని నిషేధించినా ఆచరణలో అధికారుల వైఫల్యంతో విచ్చలవిడి వినియోగం ఎక్కువగా ఉంది. అధికారుల



కవర్లతో పట్టుకు వెళ్తున్న సామగ్రి

తనిఖీలు లేవు, చర్యలు లేకుండా పోయాయి. అధికారులకు కార్యాలయాల వద్ద టీ, కాఫీలు తీసుకువచ్చేటప్పుడు పాలిథిన్ కవర్లలోనే తీసుకువస్తున్నా వారికి ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ~లు దుర్గంధభరితంగా మారుతున్నాయి.

క్యాన్సర్ వచ్చే ప్రమాదం

వేడి ఆహార పదార్థాలను ప్లాస్టిక్ సంచుల్లో తీసుకుని వెళ్లడం వల్ల పాలి ఇథలిన్, పాలి హిస్టరీస్ వంటి రసాయనాలు ఆహారపదార్థాల్లో కలిసి పోతాయనే విషయాన్ని మేధావులు చెబుతున్నారు. దీనిద్వారా క్యాన్సర్ తదితర వ్యాధులు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మనుషులకే కాకుండా పశువులకు కూడా వ్యాధులు సోకే ప్రమాదముందని హెచ్చరికలు చేస్తున్నారు. పశువులు పాలిథిన్ కవర్లు నమిలి మింగే పరిస్థితులు ఉన్నందున వాటికి ప్రమాదం అనే విషయాన్ని హెచ్చరిస్తున్నారు. ఇన్ని విధాల హెచ్చరికలు చేస్తున్నా నిషేధాన్ని అమలు చేయడంలో అధికారుల వైఫల్యం ఎక్కువగా ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

అధికారుల చర్యలు నామమాత్రం

ప్లాస్టిక్ నిషేధంపై అధికారుల చర్యలు నామమాత్రంగా ఉండడంతో విచ్చలవిడిగా వ్యాపారం సాగుతోంది. ప్రభుత్వం ఏదో ప్రకటన చేసేటప్పుడు ఆ సమయంలో అధికారులు హడావుడి చేసి, నిషేధంపై బ్యానర్లతో ర్యాలీలు చేసినట్లు ఫొటోలకు ఫోజులిచ్చి అక్కడితో మమ అనిపించేయడంతో అంతా ఆర్భాటంగానే మిగులుతోంది.

వినియోగించకూడదని అవగాహన కల్పించాం

ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాం. దీనిపై ర్యాలీలు చేపట్టాం. విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించాం. విక్రయాలు జరిపితే చర్యలు చేపట్టమని సిబ్బందికి సూచించాం.

– విజయలక్ష్మి, ఎంపీడీఓ, బలిజిపేట

ఫంక్షన్ల వద్ద ఘోరం

ఫంక్షన్లు, ఎటువంటి శుభకార్యాలు చేసినా అక్కడ ప్లాస్టిక్ వినియోగమే ఎక్కువగా కనిపిస్తోంది. కార్యక్రమం పూర్తయిన తరువాత వాటిని ఇంటి యజమానులు రోడ్డు పక్కన ఉండే చెత్త బుట్టలో వేయడం లేదా ఎక్కడైనా ఖాళీ స్థలాలు ఉంటే అక్కడ పడవేయడం అలవాటుగా మారింది. అలా పడవేసినవి గాలులకు అటు, ఇటుగా ఎగిరి చెల్లాచెదురై వాటిని ఎత్తివేసేందుకు అందుబాటులో లేకుండా పోయి భూమిలో కలిసిపోయి ప్రమాదకరంగా మారుతున్నాయి. మరికొందరు వీధికాలువల్లో చెత్తాచెదారాలతో పడవేయడంతో అవి పేరుకుపోయి కాలువ

విద్యా నైపుణ్యాలు పెంచాలి



బలిజిపేట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ–1సామల

బలిజిపేట: విద్యా నైపుణ్యాలు పెంచి రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థుల రోల్ పెంచాలని ఎంఈఓ–1సామల సింహాచలం తెలిపారు. ఈ మేరకు బలిజిపేట ప్రాథమికపాఠశాలను ఆయన మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పర్యవేక్షించి వారి నైపుణ్యాలను గుర్తించారు. తెలుగు, ఆంగ్లం భాషా అంశాలను చదివించారు. ఐదవ తరగతి విద్యార్థులకు వివిధ పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలను అడిగి వారినుంచి సమాధానాలు రాబట్టారు. పాఠశాలలో వివిధ తరగతుల్లో ఉండే వెనుకబడిన విద్యార్థులను ముందుకు తీసుకురావడానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. ఉపాధ్యాయులు లెసన్‌ప్లాన్స్, డైరీలు పెండింగ్ లేకుండా పూర్తిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు



చినభోగిలిలో రైతులకు జొన్నలో మెలకువలను వివరిస్తున్న ఏఓ ఎస్ అవినాష్

సీతానగరం: మండలంలోని మాగాణి భూముల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్నపంటలో మెలకువలు పాటించినప్పుడే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. 'పొలం పిలుస్తుంది' కార్యక్రమంలో భాగంగా మంగళవారం చినభోగిలిలో నిర్వహించిన మొక్కజొన్న పంటలో రైతులకు మెలకువలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న సాగుకు సారవంతమైన, నీరుఇంకే నల్లరేగడి నేలలు అనుకూలమైన వన్నారు. నీరు నిల్వ ఉండే భూములు పనికిరావని ఆరుతడి భూముల్లో మొక్కజొన్నపంట అనుకూలమన్నారు. విత్తన మోతాదు ఎకరా విస్తీర్ణానికి 8 కేజీలు వేసుకోవాలని, కిలో విత్తనానికి 3 గ్రాములు మంకోజెట్ లేదా థైరం లేదా కాప్టాన్‌తో విత్తన శుద్ధి చేసుకున్నట్లయితే లేతదశలో మొక్కల్లో ఆశించే తెగుళ్ళు నివారించవచ్చన్నారు. విత్తనాలు విత్తిన తరువాత రెండు లేదా మూడు రోజుల్లో అట్రజిన్ కలుపు మందు 1000 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. గడ్డిమందు పిచికారీ చేయడం వల్ల కలుపును నివారించ వచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రెండోసారి జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా ద్వారపురెడ్డి శ్రీనివాసరావు



బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావును అభినందిస్తున్న బీజేపీ నాయకులు

పార్వతీపురం టౌన్: రెండోసారి పార్వతీపురం మన్యం జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా ద్వారపురెడ్డి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం బీజేపీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ ఎన్నికల ప్రధాన కార్యదర్శి పావని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబ్జీ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా ద్వారపురెడ్డి శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపడుతున్నందుకు ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ తనపై నమ్మకంతో పార్టీ పెద్దలు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని ప్రతి కార్యకర్తకు మంచి జరిగే విధంగా అందరినీ కలుపుకుని పార్టీని ముందుకు నడిపిస్తానన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలు

మక్కువ: మండలంలోని శాంతేశ్వరం, చప్పబుచ్చంపేట గ్రామాల్లో మంగళవారం పశుసంవర్ధక శాఖ అద్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి కె. పోలందొర మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుంచి, 31వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో శిబిరాలు నిర్వహించనున్నామన్నారు.



చిలకలపల్లి రంగుముద్రి కళాశాల వద్ద ఉన్న మలుపు

ఆ మలుపులు.. ప్రమాదాలకు హేతువులు



మిర్తివలస శివాలయం వద్ద



అరసాడ జంక్షన్ వద్ద

- కనిపించని హెచ్చరికల బోర్డులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

బలిజిపేట: మలుపులు ప్రమాదాలకు హేతువుల్లా కనిపిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్అండ్‌బీ శాఖ కానీ, పంచాయతీ రాజ్ శాఖ కానీ మలుపుల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాల్సి ఉన్నప్పటికీ వాటిని ఎవరూ ఇంతవరకు ఏర్పాటుచేయలేదని, దీనివల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాపోతున్నారు. కొన్ని మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెబుతున్నారు. మలుపుల వద్ద పెద్దపెద్ద వాహనాలకు ఎదురుగా ద్విచక్రవాహనాలు వచ్చే సందర్భంలో పక్కకు తప్పుకోవడానికి అవకాశాలు లేకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయంటున్నారు. మలుపుల వద్ద రోడ్లు కోతలకు గురవడం, బెర్మలు లేకపోవడం, హెచ్చరిక బోర్డులు కనిపించ కపోవడంతో వాహనచోదకులకు



బల్లి గ్రామం వద్ద

ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రోడ్లకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ లేకపోవడం పెద్ద ప్రమాదకరంగా ఉందని చెబుతున్నారు. సింగిల్ రోడ్డు అవడంతో పక్కకు తప్పుకునేందుకు వీలులేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు సంభవించే సమయంలో వారిలో వారు రాజీలు కుదుర్చుకోవడం లేదా కేసులు నమోదుచేసుకోవడమే తప్ప మలుపుల వద్ద ప్రమాదాలను నివారించేందుకు తగు జాగ్రత్తలు పాటించాలనే ఉద్దేశం అధికారులకు లేదని దీనివలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపుతాం

మలుపుల వద్ద ప్రమాద సూచికలు అమర్చేందుకు అవసరమైన ఎస్టిమేషన్లు వేసి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం. అవి వచ్చిన తరువాత వాటికి సంబంధించిన చర్యలు చేపడతాం.

– రామ్మోహనరావు, ఏఈ, ఆర్అండ్‌బీ, బలిజిపేట

మలుపుల వద్ద ప్రమాదాలు సంభవించకుండా ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ వారి నిర్లక్ష్యం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాహన చోదకులు ఆవేదన వెళ్లగక్కుతున్నారు. పోలీస్‌శాఖ రోడ్డు భద్రతలపై అవగాహన కల్పించడమే తప్ప ఇటువంటి వాటిని పట్టించుకోవడం లేదని వీటిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు మేలు చేయాలని కోరుతున్నారు.

తహసీల్దార్‌కు ప్రోటోకాల్ పట్టదా?

- మండల సమావేశానికి హాజరుకాని తహసీల్దార్
- ప్రజాప్రతినిధుల ఆగ్రహం



ఆర్ఐని ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ రవికుమార్

బలిజిపేట: మండల తహసీల్దార్‌కు ప్రోటోకాల్ పట్టదా? రెవెన్యూ సదస్సుల సమయంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వకుండా అధికార పార్టీ నాయకులతో రెవెన్యూ సదస్సులు నిర్వహించుకోవడం ఏమిటి? సమావేశానికి ఎందుకు హాజరుకాలేదని జెడ్పీటీసీ రవికుమార్, పెద్దింపేట ఎంపీటీసీ సాంబమూర్తి, సర్పంచ్ జయప్రకాశ్‌లు ప్రశ్నించారు. ఎంపీపీ నాగమణి అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు వారివారి సమాచారాలను వివరించారు. రెవెన్యూ శాఖ పరంగా ఆర్ఐ కరుణాకర్ మాట్లాడేందుకు సిద్ధమవగా తహసీల్దార్ ఎందుకు రాలేదని ఎంపీటీసీ సభ్యుడు ఎం.సాంబమూర్తి ప్రశ్నించారు. కలెక్టర్ కార్యాలయానికి పనిమీద వెళ్లారని ఆర్ఐ బదులు చెప్పడంతో మండల సర్వసభ్య సమావేశం రోజునే పనులు ఉంటాయా అని సభ్యులు ప్రశ్నించారు. గత సమావేశానికి హాజరుకాలేదని, ఇప్పుడు హాజరుకాలేదని ఇలా అయితే రెవెన్యూ సమస్యలు ఏ విధంగా పరిష్కారమవుతాయని నిలదీశారు. అంతేకాక రెవెన్యూ సదస్సుల సమయంలో తహసీల్దార్ ప్రోటోకాల్‌ను కాలరాశి అధికార పార్టీ నాయకులకు మాత్రమే సమాచారం ఇచ్చి వారితోనే సదస్సులు నిర్వహించారని, ఇదేమి చోద్యమని ప్రశ్నించారు. వాటిని ప్రశ్నిస్తామని తెలిసి సమావేశానికి డుమ్మా కొట్టారని, దీనిపై ఉన్నతాధికారులకు తెలియపరచాలని ఎంపీడీఓ విజయలక్ష్మిని కోరారు.

దివ్యాంగ పింఛన్లు తొలగించారా?

వ్యవసాయశాఖ ఏఓ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతుండగా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రబీ పంటలకు నష్టం వాటిల్లిందని పంటనష్టం వస్తుందా? రాదా? అని సభ్యులు ప్రశ్నించగా 30శాతం కంటే ఎక్కువ నష్టం వాటిల్లితే పరిహారం వస్తుందని ఏఓ తెలిపారు. వెండర్ కోడ్‌పై పనులు చేపట్టవద్దని పీఆర్ ఏఈ అంబేడ్కర్‌కు సూచించారు. వికలాంగ పింఛన్లపై సర్వే నిర్వహించారు కదా వాటిలో ఏమైనా తొలగించారా? లేదా? అని సభ్యుల ప్రశ్నించగా అధికారుల నుంచి సరైన సమాధానం రాలేదు. దీనిపై సభ్యులు అసంతృప్తి చెందారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్, ఎంపీడీఓ విజయలక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్‌పై అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు

పార్వతీపురంటౌన్: మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలులో భాగంగా అర్హులైన కుటుంబాల వారికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా పౌర సరఫరాల అధికారి పి.ధర్మ చంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకంలో జిల్లాలో ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పొందుతున్న సిలిండర్లకు తాము చెల్లించిన నగదు మూడు రోజుల్లోపు తమ ఖాతాల్లో జమ అవుతున్నాయని లబ్ధిదారులు చెబుతున్నారన్నారు. లబ్ధిదారులు దీపం–2 ఉచిత గ్యాస్ పథకం కింద చెల్లించాల్సిన అసలు బిల్లుకు అదనంగా రూ.80 నుంచి రూ.150 వరకు కొన్ని గ్యాస్ ఏజెన్సీల డెలివరీ బాయ్స్ వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో సదరు గ్యాస్ ఏజెన్సీ సేల్స్ అధికారులతో సమావేశం నిర్వహించి, లబ్ధిదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులు రుజువైతే సదరు గ్యాస్ ఏజెన్సీలపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటువంటి ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టి వారి లైసెన్సులను రద్దు చేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద ఏ ఒక్కరూ ఎటువంటి అదనంగా డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదని, ఆ విధంగా కాకుండా లబ్ధిదారుల నుంచి గ్యాస్ ఏజెన్సీలు అదనంగా డబ్బులు వసూలు చేస్తే 1967 అనే టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని, ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయం నందు జరుగు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో (పీజీఆర్ఎస్) కూడా ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు.

పీఎం సూర్యఘర్‌తో బహుళ ప్రయోజనాలు

- ఏపీట్రాన్స్‌కో డీఈఈ సీహెచ్‌వీ రమణరావు



మాట్లాడుతున్న ఏపీట్రాన్స్‌కో డీఈఈ సీహెచ్‌వీ రమణ రావు

సీతానగరం: కేంద్రప్రభుత్వం అమలు చేసిన సూర్యఘర్ సోలార్ సిస్టం వల్ల విద్యుత్ వినియోగ దారులకు బహుళ ప్రయోజనాలున్నాయని, ప్రతి ఒక్కరూ సోలార్ సిస్టం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏపీట్రాన్స్‌కో డీఈఈ సీహెచ్ వి.రమణరావు అన్నారు. ఈ మేరకు మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సోలార్ సిస్టం అమలుకు అవసరమైన స్థల సేకరణకు తహసీల్దార్ ప్రసన్నకుమార్‌తో చర్చించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం సూర్యఘర్ పథకం ద్వారా విద్యుత్ వినియోగ దారులకు రాయితీపై సోలార్ పథకాన్ని మంజూరుచేయనున్నట్లు తెలిపారు. 1 కిలోవాట్ విద్యుత్ ఉత్పత్తి చేయడానికి రూ.70 వేలు అవుతుందని ప్రభుత్వం రూ.30 వేలు రాయితీ ఇస్తుందని చెప్పారు. 1 కిలోవాట్ విద్యుత్ ఉత్పతి చేస్తే ఒకకుటుంబానికి మూడు ఫ్యాన్‌లు, ఇంటికి అవసరమైన విద్యుత్ తయారవుతుందన్నారు. విద్యుత్ ఎక్కువ ఉత్పత్తిఅయితే విద్యుత్ శాఖ కొనుగోలు చేసి మూడునెలలకో పర్యాయం విద్యుత్ వినియోగదారులకు నగదు జమ చేస్తుందన్నారు. సోలార్ సిస్టం విద్యుత్ పొందనున్న వారికి రుణం సమకూర్చడానికి బ్యాంక్‌లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ జగన్మోహనరావు, ఆర్ఐ ఎస్ శ్రీనివాసరావు, వీఆర్వోలు, విద్యుత్ లైన్‌ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలన ప్రణాళికపై శిక్షణ

పార్వతీపురం టౌన్: 2027 నాటికి మలేరియా నిర్మూలన లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర అదనపు సంచాలకురాలు డా.ఎస్ సుబ్రమణ్యేశ్వరి పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.ఎస్ భాస్కరరావు ఆధ్వర్యంలో వైద్యాధికారులు, మలేరియా సబ్‌యూనిట్ అధికారులతో ఎన్‌జీఓ సమావేశ భవనంలో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్సీవీబీడీసీకి సంబంధించి పీహెచ్‌సి వైద్యాధికారి నుంచి దిగువస్థాయి సిబ్బంది వరకు నిర్వహించాల్సిన విధులను వివరించి విధిగా పనిచేయాలని ఆదేశించారు. ఫైలేరియా గుర్తించిన ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని, ఆరోగ్యశాఖ జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు వైద్యాధికారులు, సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో జోనల్ మలేరియా అధికారి డా.శాంతిప్రభ, డిప్యూటీ డీఎంహెచ్ఓలు డా. కె.విజయపార్వతి, డా.కేవీఎస్ పద్మావతి, జోనల్ ఎ.డిలు డా.జి.వీర్రాజు, మలేరియా అధికారి డా.వై.మణి డీఐఓ డా.ఎం.నారాయణరావు, జిల్లా ప్రోగ్రాం అధికారులు డా.టి.జగన్ మోహనరావు, డా.పీఎల్ రఘుకుమార్, డా.ఎం.వినోద్ కుమార్, స్టేట్ టీమ్ ఎం.పార్వతీశం, కె.శ్రీకాంత్, ఏఎంఓ బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంవీఐ సత్యనారాయణ

పార్వతీపురం టౌన్: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏఎంవీఐ సత్యనారాయణ అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాలు 2025లో భాగంగా జిల్లాలో జరుగుతున్న ద్విచక్రవాహన రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక ప్రజారవాణా శాఖ కార్యాలయంలో వేదాంత జూనియర్ కళాశాల కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎల్.నాయుడు, నెహ్రూ యువ కేంద్ర వలంటీర్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు, వాహనం వెనక కూర్చున్న వారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. లేనిపక్షంలో జరిమానాతో పాటు మూడు నెలలు డ్రైవింగ్ లైసెన్స్ క్యాన్సిల్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ విధివిధానాలు, హెల్మెట్ ధరించకపోతే కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు రహదారి భద్రతకు సంబంధించి క్విజ్‌పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులతో రోడ్డు సేఫ్టీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ ప్రజారవాణాధికారి జి.సత్యనారాయణ, ఎన్.రమేష్‌కుమార్ వరప్రసాద్, బి.కాశీరామ్ నాయక్ రవాణాశాఖ సిబ్బంది వేదాంత జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

